
మిర్చి ధర దడ



- రెండేళ్లుగా పడిపోతున్న పంట ధరలు
- క్వింటా రూ.99వేల నుంచి రూ.20 వేలకు పతనం
- ఎగుమతులు లేకుంటే ఇంకా తగ్గే అవకాశం
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో పేరుకుపోయిన బస్తాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 68 వేల ఎకరాల్లో సాగు

వరంగల్ వ్యవసాయం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి మిర్చి సాగు చేసిన రైతులకు పంట అమ్ముకునే సమయంలో ధరలు నిరాశపరుస్తున్నాయి. మార్కెట్లో ఇప్పటికే మిర్చి సీజన్ ప్రారంభంకాగా, ధరలు చూస్తే మాత్రం ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అసలే ఓ వైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి తగ్గింది. మరోవైపు పెట్టుబడి పెరిగింది. ఈ నేపథ్యంలో పంట అమ్మితే వచ్చే ఆదాయానికి, పెట్టిన పెట్టుబడికి పొంతనలేకుండా పోతోంది. ప్రస్తుతం మార్కెట్లో మిర్చి ధరలు చూస్తే రైతులు అప్పుల పాలయ్యే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి.

కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి బస్తాలు

మార్కెటింగ్‌శాఖ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఉన్న 87 కోల్డ్ స్టోరేజీలలో ఇప్పటికే 21 లక్షలపై చిలుకు మిర్చి బస్తాలు నిల్వ చేసి ఉన్నాయి. అందులో ప్రస్తుతం వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ పరిధిలో ఉన్న 25 కోల్డ్ స్టోరేజీల్లో ఇప్పటికే సుమారు పది లక్షల బస్తాల మిర్చి బస్తాలు నిల్వ ఉన్నాయి. గతేడాది కూడా మిర్చి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ధర పెరిగినప్పుడు అమ్ముకుందామని చూస్తుంటే ధరలు మాత్రం రోజు రోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎగుమతులు లేకనే తగ్గుతున్న ధరలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, గుంటూరు జిల్లాలు మిర్చి పంటకు ప్రసిద్ధి. ఇక్కడ పండిన మిర్చి దేశీయంగానే కాక విదేశాలకు కూడా పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, ఇండోనేషియా, టిబెట్, చైనా, మలేషియా తదితర దేశాలకు విక్రయిస్తారు. మన దేశం నుంచి మిర్చి ఎగుమతి చేయాలంటే నాణ్యతే ప్రమాణికం. మిర్చి కలర్, తేమశాతం, పురుగుమందుల అవశేషాలు ఇలా అన్నింటినీ పరిగణలోకి తీసుకున్నాకే ఎగుమతులకు అనుమతులు లభిస్తాయి. లేదంటే దేశీయంగా ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు ఎంత ఎగుమతులు చేసినా ధరలు పెరిగే అవకాశం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.

2023 సంవత్సరం.. మిర్చి పంటకు సువర్ణయుగం

మిర్చి రైతులకు 2023వ సంవత్సరం సువర్ణ యుగం అని చెప్పాలి. అపుడు మిర్చి క్వింటాల్‌కు రూ.99 వేల ధర పలికింది. అంత ధర పలుకుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ ఆ తరువాత వరుసగా ధరలు పతనమవుతూ వస్తున్నాయి. ప్రస్తుతం దేశీ రకం మిర్చికి క్వింటాకు రూ.18 నుంచి 25 వేల వరకు ధర పలుకుతోంది.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తే గిట్టుబాటు ధర

పోలెపాక నిర్మల, ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

మిర్చి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు చంటి పిల్ల వలె చూసుకోవాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువులను వాడాలి. పంట చేతికి వచ్చిన తరువాత కాయలు చిన్నవి, పెద్దవి, నలుపు, తాలు ఇలా దేనికి అవే అన్నట్లు గ్రేడింగ్ చేయాలి. అదేవిధంగా మార్కెట్‌కు తరలించే ముందు బాగా ఆరబెట్టి తేమ లేకుండా చేయాలి. అప్పుడే మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుంది. రైతులు హార్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద కోరారు. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నేషనల్ హైవే భూసేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ సేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండ, సంగెం మండలం చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని, నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు తమ భూములు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటస్వామి, రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నగరం ఆధ్యాత్మిక సౌరభం



◀నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తికళాకారులు, చిన్నజీయర్ అభివాదం

- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- హిందూ ధార్మిక విలువలను విస్తరింపచేద్దాం
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి
- వరంగల్ కేంద్రంగా సంకీర్తన మండలికి శ్రీకారం

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే



క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులు నిర్దేశిత నిబంధనలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. గురువారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్‌ల ఏర్పాటు, బిల్డింగ్ నిర్మాణ అనుమతులకు పలువురు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాటికి అనుమతుల మంజూరు కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా లేఅవుట్ అనుమతుల జారీ కోసం అమ్మవారిపేట, మడికొండ ప్రాంతాల్లో, భవన నిర్మాణ అనుమతుల జారీ కోసం వడ్డెపల్లి ప్రాంతంలో కమిషనర్ పర్యటించి కొలతలు వేసి సమాచారాన్ని ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హర్షద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- షీటీమ్ ఫిర్యాదులపై సున్నితంగా వ్యవహరించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- ఆర్గనైజన్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా, చిత్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : డయల్ 100 ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వీలైనంత తొందరగా చేరుకోవాలని ఆర్గనైజన్ అండ్ హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఉదయం పోలీసు అతిథి గృహానికి చేరుకున్న అడిషనల్ డీజీపీకి సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సాయుధ బలగాలు గౌరవవందనం చేశారు. తనిఖీల్లో భాగంగా కమిషనరేట్ కార్యాలయానికి చేరుకొని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీపీ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

అనంతరం డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ఏర్పాటైన షీటీమ్ పట్ల ప్రజలకు అవగహన కల్పించడంతో పాటు షీ టీమ్‌లో ఇచ్చే ఫిర్యాదులను అధికారులు సున్నితంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు న్యాయం కల్పించడంతో పాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసు నమోదు చేయాలన్నారు. స్టేషన్ అధికారులకు భరోసా కేంద్రం పనితీరు తెలిసేలా కేంద్రాన్ని సందర్శించి అక్కడి కార్యకలాపాలను తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్, మత్తు పదార్థాలు, ర్యాంగింగ్, సైబర్ నేరాలలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కళాశాలల్లో సేఫ్టీ ఉమెన్, సేఫ్టీ ట్రాఫిక్, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ క్లబ్‌లను ఏర్పాటుచేసి సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. జాగృతి కళాబృందం ద్వారా ప్రజలకు నష్టం కలిగే అంశాలలపై అవగాహన కల్పించాలన్నారు. బాల నిర్మూలన కోసం నిరంతరం తనిఖీలు కొనసాగించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కమిషనరేట్ భవనంతో పాటు రిజర్వుడ్ ఆయుధాగారంతోపాటు డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సలీమా, రవీందర్, రాజ మహేంద్ర నాయక్, అదనపు ఎస్పీలు చేతన్, మనాన్ భట్, ఏఆర్ అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.


రైల్వే డీఆర్ఎం భరతేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

రైల్వే డీఆర్ఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే భవన్‌లో గురువారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్‌ను, ఏడీఆర్ఎం ఎం.గోపాల్‌ను కలిశారు. కాజీపేటలో నిర్మించ తలపెట్టిన బస్టాండ్‌పై చర్చించారు. సాధ్యమైనంత త్వరగా బస్టాండ్ స్థలాన్ని అప్పగిస్తే, శంకుస్థాపన పనులు చేపడుతామని కోరారు. అనంతరం బస్టాండ్ స్థల మ్యాప్‌ను పరిశీలించారు. బస్టాండ్ స్థలాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ వినతిప్రతం సమర్పించారు. బస్టాండ్ ప్రతిపాదనలు త్వరలో రైల్వే బోర్డుకు పంపిస్తామని డీఆర్ఎం చెప్పినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్ ఉన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు పతకం


బంగారు పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

వరంగల్ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కుస్తీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకుంది. కరీంనగర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ నవీన్ 97 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన క్రీడాకారుడిపై విజయం సాధించి నవీన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తొలి బంగారు పతకాన్ని సాధించి పెట్టాడు. ఈ సందర్భంగా నవీన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, జట్టు మేనేజర్ నాగయ్య అభినందించారు.

పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కుసుమ శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకునేందుకు పాఠశాలతో పాటు, ప్రత్యేక శిక్షణ అవసరమని సన్మార్గం, సత్ప్రవర్తన శిక్షణ ప్రధాన పర్యవేక్షకుడు కుసుమ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన కొలనుపాక సుమన్ శాస్త్రితో కలిసి యాదవ నగర్‌లో వేసవికాలంలో నిర్వహించే శిక్షణ శిబిరం వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 20 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, జూన్ 11వ తేదీ నుంచి 41 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల నుంచి 14 ఏళ్ల మగ పిల్లలకు మాత్రమే ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకొని శిబిరానికి పంపిస్తే చక్కని క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన, విద్య పట్ల ఆసక్తి, కళల పట్ల మక్కువ కలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తామని కుసుమ శ్రీనివాస్ చెప్పారు. వివరాల కోసం 9849267993 మొబైల్‌లో సంప్రదించాలని సూచించారు.

బీసీలు రాజకీయాలను శాసించాలి

పద్మశాలీ సంఘం జాతీయ నేత ఈగ మల్లేశం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఈగ మల్లేశం, శ్రీరాములు, సమ్మారావు

వడ్డెపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టి హక్కులను సాధించుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా ఆధిపత్య కులాల పాలకులు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తెచ్చి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాష్ట్రంలోని 60 లక్షల మంది నిరుద్యోగులకు శాపంగా మారాయన్నారు. కేవలం మూడు శాతం ఉన్న ఓసీ కులాలకు 10 శాతం, 65 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వే షన్లు మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్రనేత గుండు ప్రభాకర్ మాట్లా డుతూ.. బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దృష్టి కి తీసుకెళ్లేందు కోసం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వం లో ఫిబ్ర వరి 2న హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మధ్యా హ్నం 2గంటలకు నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు రాజకీయాలకతీతంగా అన్ని బీసీ కులాలతో పాటు పద్మశాలీ కులస్తులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వడ్నాల నరేందర్, చంద మల్లయ్య, బచ్చు ఆనందం, దుస్స శివశంకర్, ఆడెపు రవీందర్, చిప్ప వెంకటేశ్వర్లు, శామంతుల శ్రీనివాస్, బేతి అశోక్, మేడారపు సుధాకర్, గాడి పల్లి రాజేశ్వర్‌రావు, బైరి శ్రీనివాస్, పరికిపండ్ల వేణు, జానకీరాములు, బీ రమేష్, శివశంకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఐలాపూర్ జాతర పనులు పూర్తి చేయాలి

అధికారులతో ములుగు కలెక్టర్ దివాకర


ఐలాపూర్‌లో గద్దెల ప్రాంగణంలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

కన్నాయిగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని ఐలాపూర్‌లో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ జాతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. గురువారం ఆయన ఐలాపూర్‌లో పర్యటించారు. భక్తులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాల కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా జాతర పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం వనదేవతలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు మల్లెల రవి, మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య, వీరీల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల ఆలయాన్ని సందర్శన

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయి, మాల్యాల, దొడ్ల గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గోవిందరాజుల ఆలయాన్ని సందర్శించిన ఆయనకు సారలమ్మ ప్రధాన పూజారి, మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు గిరిజన సాంప్రదాయ ప్రకారం స్వాగత పలికారు. అనంతరం గోవిందరాజుకు కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 12 నుంచి జరిగే మేడారం మినీ జాతర సందర్భంగా కొండాయిలోని గోవిందరాజుల ఆలయం వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాపై తప్పుడు ప్రచారం చేశారు

- ఏ ఉగ్రవాద సంస్థతో మాకు సంబంధం లేదు
- పోలీసులు విచారణ చేసింది వాస్తవమే..
- మా సంఘానికి క్లీన్ చిట్ ఇచ్చి పంపించారు
- ఆల్ ఇండియా జమాతే ముస్లీమి అధ్యక్షుడు జక్రియా

వరంగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరిగిందని, తనకు, తమ సంఘానికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు లేవని ఆల్ ఇండియా జమాతే ముస్లీమి జాతీయ అధ్యక్షుడు జక్రియా స్పష్టం చేశారు. గురువారం వరంగల్ చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను 2021మార్చి నుంచి ఆల్ ఇండియా జమాతే ముస్లీమి సంఘానికి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానన్నారు. అయితే ఈ నెల 25వ తేదీన తాను శ్రీలంకకు వెళుతుండగా, చెన్నై ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్ వద్ద పోలీసులు తనను నిలిపి అదుపులోకి తీసుకున్నారని, రెండు రోజులు వారి అదుపులోనే ఉంచుకుని, ఫోన్, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారన్నారు. రెండు రోజుల విచారణ తర్వాత తరువాత తమ సంఘానికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని క్లీన్‌చిట్ ఇచ్చారని వివరించారు. తమ సంఘం ప్రచారానికి ఎక్కడైనా పోవచ్చని అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అయితే తనకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్టు కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్టు జక్రియా తెలిపారు.


ఉపాధి పనుల నివేదికను ప్రజావేదికలో వివరిస్తున్న డీఆర్పీలు

ఉపాధి హామీలో గోల్‌మాల్.!?

మరిపెడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది మరిపెడ మండలంలోని 44 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గురువారం జరిగిన సోషల్ ఆడిట్ ప్రజా వేదికలో వెల్లడైంది. ఊరూరా ఎఫ్ఏలు గతం లాగానే మళ్లీ అవే కాకి లెక్కలతో అక్రమాలకు పాల్పడ్డట్లు బట్టబయలైంది. సోషల్ ఆడిట్ సర్వే బృందాలు పక్షం రోజులుగా మండలంలోని ఊరూరా జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ నివేదికలను గురువారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇన్‌హౌస్ ప్రజావేదికలో డీఆర్పీలు జిల్లా ఉన్నతాధికారులకు పలు ఆసక్తికర విషయాలను నివేదించారు. ఎఫ్ఏలు తమ అనుయాయులకు పనులు చేయకున్నా మస్టర్ రోల్‌లో పేర్లు రాసి బిల్లులు స్వాహా చేసినట్లు వెల్లడయ్యింది. ఆనేపురంస్టేజీ, నీలికుర్తి, ఎల్లంపేట, వీరారం, ఉల్లెపల్లి, గాలివారిగూడెం తదితర గ్రామాల్లో పనులు లేకుండానే బిల్లులు పొందారు. నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించాలని ఆయా గ్రామాల బాధితులు డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రావు చెప్పారు. కార్యక్రమంలో డీవీసీ మన్మోహన్, ఏపీసీ అంజిగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీవో కనకదుర్గ, గతంలో పని చేసిన ఎంపీడీవో ధన్‌సింగ్, అంబుడ్స్ మేనేజర్ ఆదామ్, ఎస్ఆర్పీలు చెన్నకేశవులు, కొమురయ్య, ఏపీవో మంగమ్మ, ఎంపీవో సోమ్లానాయక్, ఎఫ్ఏలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎమ్మెస్సీ ప్రాక్టికల్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాదికి సంబంధించిన ఎమ్మెస్సీ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్-1 ప్రాక్టికల్ తరగతులను నిర్వహిస్తామని కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట గోపీనాథ్ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగం కోర్సుల అభ్యర్థులందరూ వర్సిటీలోని ఆయా విభాగాల్లో నిర్వహించే ప్రాక్టికల్ తరగతులు ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీల్లో జరుగుతారని వెల్లడించారు. అలాగే ఫిబ్రవరి 9, 10న ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తరగతులకు హాజరై పరీక్షలు రాయాలని కోరారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌గా కిశోర్


డాక్టర్ కిశోర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

వరంగల్ మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిశోర్ పూర్తి అదనపు బాధ్యతలు గురువారం స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కిశోర్‌ను టీఎన్‌జీవో హనుమకొండ జిల్లా అధ్యక్షు డు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ.. ఎంజీఎం అభివృద్ధికి, రోగు ల సంరక్షణకు, మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్ అలీ, లక్ష్మీప్రసాద్, రవికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వర్‌రావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాయల నాగేశ్వర్‌రావు

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గోదాముల నిర్వహణతో పాటు అందులో నిల్వల రికార్డులు సక్రమంగా ఉండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు అన్నారు. గురు వారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో వరంగల్ రీజియన్ పరిధిలోని గిడ్డంగుల సంస్థల మేనేజర్లతో నాగేశ్వర్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిడ్డంగుల నిర్వహణపై వారికి పలు సూచనలు చేశారు. గోదాముల్లో బాగా కష్టపడి పని చేసేవారిని గుర్తించి వారికి ప్రోత్సాహం ఇస్తామన్నారు. గోదాముల్లోని నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. గోదాముల్లో ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. గోదాములను ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనఖీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ ఎండీ కొర్ర లక్ష్మి, జనరల్ మేనేజర్లు ఆనంద్ కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటలో యువకుడి ఆత్మహత్య

మృతుడి స్వస్థలం ఏపీలోని విశాఖపట్టణం

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస సెంటర్‌లోని శివప్రియ లాడ్జ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్టణానికి చెందిన యువకుడు పనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (31) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్సై శివకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణం జిల్లా నర్సీపట్నంలోని చాకలీ కాలనీకి చెందిన పవన్ ప్రేమ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 12.25 గంటలకు శివప్రియ లాడ్జ్‌లోని రూమ్ నెంబర్ 107ను అద్దెకు తీసుకున్నాడు. లాడ్జ్ యాజమానికి ఎస్ఎస్‌సీ పరీక్ష ఉందని, అందుకే విశాఖపట్టణం నుంచి ఇక్కడికి వచ్చానని తెలిపినట్లు చెప్పారు. పవన్ ప్రేమ్‌కుమార్‌కు మూడు నెలల క్రితం వివాహం అయినట్లు తెలిసింది. తల్లిదండ్రులు వస్తే కానీ పవన్ ప్రేమ్ కుమార్ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందో.. వివరాలు తెలుస్తాయని ఎస్సై పేర్కొన్నారు. కాగా, మృతుడి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో సమాచారం ఆలస్యమవుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2525	2130
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	5400	3100
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
ఎల్లో మిర్చి	16500	13500
తేజ మిర్చి	13500	9000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్ 341	14500	11500
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

క్వింటా మిర్చిని రూ.25 వేలకు కొనాలి

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : క్వింటా మిర్చి రూ.25 వేలకు కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటా మిర్చిని అధికంగా రూ.13 వేలకే కొనుగోలు చేయడ దారుణమని విమర్శించారు. భారీ ఎత్తున మిర్చి మార్కెట్‌కు తరలివస్తున్నప్పటికి ధరను నామమాత్రం ధరలకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. గత ఏడాది క్వింటా మిర్చి రూ.24 వేలధర పలికిందని చెప్పారు. ఓ వైపుమిర్చి 35-40 క్విం టాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 15-20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని దాంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కోల్డ్ స్టోరేజ్‌లలో దాచుకుందామనుకున్న వ్యాపారులు, కమిషన్ ఏజెంట్‌లే లిష్ట వేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళారి వ్యవస్థను నివారించాలని అందుకు గాను అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లలో కూడ తనిఖీలు నిర్వహించాలని, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మిర్చి ని కొనుగోలుచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్‌రెడ్డి, బయ్య సోమన్న, నీరుటి జలేందర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, పులగుజ్జు రామ్మూర్తి, అంగోత్ ఇస్లా, రామసాని రాంరెడ్డి పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు



కేయూలో పదవుల పందేరం

- రిజిస్ట్రార్ సహా కీలక పదవులకు కొత్త ముఖాలు
- ఎస్సీ ప్రొఫెసర్‌కు రిజిస్ట్రార్ పోస్టు ఇచ్చే చాన్స్
- పరిపాలన పదవుల్లో కొందరికీ ఎప్పుడూ మొండిచెయ్యే
- సీఎంతో కీలక భేటీ నేపథ్యంలో పోస్టుల భర్తీ అలస్యం

కేయూ క్యాంపస్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో నూతన పరిపాలన అధికారులు త్వరలోనే పగ్గాలు చేపట్టనున్నారు. రిజిస్ట్రార్‌తో సహా ఇతర కీలక పదవులన్నింటినీ సమర్థులతో భర్తీ చేసేందుకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఇప్పటికే సమాలోచనలు చేసినట్లు సమాచారం. అయితే ఎవరు ఏ పోస్టుకు సరిపోతారనే అంశంలో కొంత సంశయంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు పరిపాలన పదవుల భర్తీ విషయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే వీసీ ఓసీవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కచ్చితంగా ఎస్సీ వర్గానికి చెందిన ప్రొఫెసర్‌కే రిజిస్ట్రార్ పదవి వస్తుందని వర్సిటీలో జోరుగా చర్చ నడుస్తోంది. రిజిస్ట్రార్‌తో పాటు మరిన్ని కీలక పదవులైన కేయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీడీసీ అకడమిక్ డీన్, సీడీసీ అకడమిక్ ఆడిట్ డీన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్, కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, కేయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, హాస్టల్స్ డైరెక్టర్‌తో పాటు ఇతర కీలక పదవుల్లోకి కొత్తగా పలువురు ప్రొఫెసర్లతో భర్తీకానున్నాయి. ఇప్పుడున్న పరిపాలన అధికారులందరూ గతంలో నియమించబడిన వారు కావడంతో వారందరి పదవులలో మార్పులు, చేర్పులు చేయనున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్సిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో వర్సిటీల్లో పెండింగ్ విషయాలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నత విద్య మండలి, ఉన్నత విద్య కమిషనరేట్ కార్యాలయ అధికారులు సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు నివేదికలు కోరుతున్నారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది విషయంలోనూ నిబంధనలను విధిస్తున్నారు. వర్సిటీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండంతో వర్సిటీలో పరిపాలన, అకడమిక్ అధికారుల పాత్ర రానున్న కాలంలో మరింత కీలకం కానుంది.

ఆశావహుల ఎదురుచూపులు

కాకతీయ యూనివర్సిటీలో 409 మంది ప్రొఫెసర్ల పోస్టులకుగాను ప్రస్తుతం 76 మందే రెగ్యులర్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. గతంలో పనిచేసిన కీలకమైన ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ పొందారు. వారి స్థానంలో 2010 తర్వాత నుంచి వర్సిటీలో రెగ్యులర్ నియామకాలు జరగలేదు. 15 ఏళ్లకాలంలో పోయే వారే తప్ప.. వచ్చే వారు కరువయ్యారు. దీంతో వర్సిటీలో తీవ్రమైన ప్రొఫెసర్ల కొరత ఏర్పడింది. 2010లో నియమితులైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల బ్యాచ్‌లో 32 మందికి కోర్టు కేసుల నేపథ్యంలో ఇంక్రిమెంట్లతో పాటు పదోన్నతులను ఇవ్వలేదు. దీంతో వారికి వర్సిటీలో పరిపాలన పదవులు అందని ద్రాక్షలాగే మారాయి. గత వీసీ కాలంలో ఒక్కరిద్దరి పైరవీలకు తలొగ్గి వర్సిటీలో పరిపాలన పోస్టులు కట్టబెట్టినప్పటికీ తర్వాత తొలగించారు. 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసు విషయం తెలితే వారికీ పరిపాలన పదవులను కేటాయించే అవకాశాలున్నాయి. ఇప్పుడున్న ప్రొఫెసర్ల కంటే అధికంగా వర్సిటీలో పరిపాలన పదవులు ఉండడంతో దాదాపు అందరికీ పదవులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే పలుకుబడి కలిగిన వర్సిటీ పదవుల కోసం ప్రొఫెసర్ స్థాయి వ్యక్తులందరూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి దృష్టిలో పడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే పదవుల కోసం పైరవీలకు దిగుతున్నారు.

అసంతృప్తి సెగలు

కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్లకు పదవుల పంపిణీపై అసంతృప్తి సెగలు కమ్ముకున్నాయి. వర్సిటీలో పదవులు వచ్చినోళ్లకు వస్తున్నాయని, రానివారికి ఏమీ రాకపోవడంతో పలువురు ప్రొఫెసర్లలో అసంతృప్తి నెలకొంది. కొందరు సర్వీస్‌లోకి వచ్చినప్పటి నుంచి దాదాపు ఏళ్లుగా పరిపాలన పదవుల్లోనే కొనసాగుతున్నారు. వర్సిటీలో పలువురు ప్రొఫెసర్లకు పదవులేమీ కావడం లేదు. పరిపాలన పదవులు నిర్వహించని వారికి వర్సిటీలో ఉద్యోగ విరమణ సమయంలో పలు బెనిఫిట్స్ లభిస్తాయి. దీంతో పదవులకు డిమాండ్ పెరగుతోంది. వర్సిటీలో కీలకమైన డిపార్టుమెంట్లలో పనిచేసే ప్రొఫెసర్లలో సగానికి కంటే ఎక్కువ మంది పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. పదవుల్లో ఉన్న ప్రొఫెసర్లు పాఠాలు చేప్పే తీరిక దొరకడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీంతో అకడమిక్ వాతావరణం దెబ్బతింటోంది. వర్సిటీలో పదవులు కొందరు ప్రొఫెసర్లకే ఇచ్చి మరికొందరికీ మొండి చెయ్యి చూపడం పట్ల విమర్శలు వెల్లువెత్తున్నాయి.

వర్సిటీ పదవులు ఇలా..

మ్యాథ్స్ విభాగంలో ఆరుగురికి.. నలుగురు పదవుల్లో ఉండగా జువాలజీలో నలుగురికి.. ముగ్గురు పదవుల్లో కొనసాగుతున్నారు. కెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, కామర్స్‌లో నలుగురికి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్‌లో నలుగురికి ఒక్కరు, జియాలజీ, ఎకానమిక్స్‌లో ఉన్న ఒక్కొక్కరు, ఫార్మసీలో ఏడుగురికి ఒక్కరు పరిపాలన పదవుల్లో కొనసాగుతున్నారు. వీరంతా పదవుల్లో ఉంటే విద్యార్థులకు పాఠాలు, పరిశోధన ఎలా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదిలా ఉండగా, ఇంకా పాలక మండలి సభ్యులుగా, డీన్లు, ప్రిన్సిపాల్స్, హెడ్స్ తదితర అకడమిక్ పదవుల్లోనూ మరికొందరు ప్రొఫెసర్లు కొనసాగుతున్నారు.

కీలకం కానున్న ఓఎస్డీ పోస్టు

గతంలో కేయూలో ఎప్పుడూ లేని ఓఎస్డీ పోస్టును తాజాగా తెస్తున్నారు. వర్సిటీలో ఓఎస్డీ పోస్టుకు రాష్ట్రఫైనాన్స్ సెక్రటరీ అభ్యంతరాలు లెవనెత్తినప్పటికీ వర్సిటీ పాలకమండలి సైతం ఆమోదం తెలిపింది. వర్సిటీలో వీసీ- రిజిస్ట్రార్‌ల మధ్య స్థంగా ఓఎస్డీ పని చేస్తారు. పాలక మండలి, వీసీ నిర్ణయాలను రిజిస్ట్రార్ అమలు చేస్తారు. అయితే మధ్యలో ఓఎస్డీ పోస్టు అవసరమా? అనే అభ్యంతరాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు వర్సిటీలో ఎప్పుడు ఓఎస్డీ పోస్టే లేదు కదా.. అని వర్సిటీలో అందరూ చర్చించుకుంటున్నారు. తాజాగా వర్సిటీలో ఓఎస్డీ పోస్టును భర్తీ చేయనుండటంతో ఓఎస్డీ కీలకంగా మారనున్నారు. అయితే వర్సిటీ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఓఎస్డీ పోస్టు అనవసరమనే భావన వర్సిటీలో నెలకొంది.

సీఎంతో భేటీ అనంతరమే ప్రకటన



వర్సిటీల డీపీఆర్ (డిటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు)లను తయారు చేయాలని గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్సిటీల వీసీలకు ఆదేశాలు ఇచ్చారు. వర్సిటీల్లో ఇప్పుడున్న సిబ్బంది మొదలుకుని వర్సిటీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలన్నీ తమకు డీపీఆర్ రూపంలో పకడ్బందీగా సమర్పించాలని సూచించారు. వర్సిటీలో వీసీ డీపీఆర్‌ల ఏర్పాటుకోసం కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి డీపీఆర్‌ను సిద్ధం చేశారు. గతంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు కేయూ డీపీఆర్‌లను సమీక్షించారు. గతంలో సంక్రాంతి పండగకు ముందే సీఎం - వీసీల భేటీ షెడ్యూల్ ఉండగా, మళ్లీ ఎప్పుడు ఉంటుందనేది తెలియరాలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి డీపీఆర్‌ల భేటీ ముగిసిన తర్వాత వర్సిటీలో నూతన పరిపాలన అధికారుల నియామకాల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే సీఎం రేవంత్ రెడ్డి భేటీ అలస్యం జరిగితే వీలైనంత త్వరలోనే కొత్త అధికారుల నియామకాల ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి.

నిబంధనలు పాటించు.. క్షేమంగా జీవించు..

- రోడ్డు భద్రతా నియమాలపై అందరికీ అవగాహన అవసరం
- ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ఎంతో ముఖ్యం
- రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు
- నెలరోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాల నిర్వహణ



ఉర్సుగుట్ట వద్ద ట్రాలీ ఆటోకు రేడియం స్టిక్కర్ వేయిస్తున్న ఎంవీఐ శోభన్‌బాబు(ఫైల్)

ఖిలావరంగల్ / వర్ధన్నపేట రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'సెల్‌ఫోన్ కంటే ప్రాణం విలువైంది. హెల్మెట్ కంటే మన తల ఖరీదైంది. కారులోని సీటు బెల్టు మన ప్రాణాలను రక్షిస్తుంది' అంటూ పోలీసులు, రవాణాశాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిని వాహనదారులు గుర్తించినప్పుడే రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య తగుతుందని.. అందుకే 'రోడ్డు నిబంధన పాటించు.. క్షేమంగా జీవించు' అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 1న ప్రారంభమైన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగుస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు అధికారులు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన వస్తున్న చెట్ల పొదలను తొలగింపజేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులను నిలిపి గులాబీ పువ్వులు ఇచ్చి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. 'మీ క్షేమమే.. మా ధ్యేయం' అంటూ తలకు హెల్మెట్లను పెట్టి అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ నియమాల గురించి పోస్టర్లు, కరపత్రాలు, సామాజికమాధ్యమాలు, కళాజాత, అవగాహన సదస్సుల ద్వారా వివరించారు. డ్రండెన్ డ్రైవ్‌లు పెట్టి మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

శిరస్త్రాణమే శ్రీరామ రక్ష

వాహనదారులు శిరస్త్రాణమే శ్రీరామ రక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెల్మెట్ ధరించని వారిని హెచ్చరించడం, సీటు బెల్టు పెట్టుకోని సూచించడం లాంటివి చేశారు. అయినా సరే చాలా మంది వాహనదారుల్లో పెద్దగా మార్పు రావడం లేదు. నిత్యం ట్రాఫిక్ కూడళ్లలో, హైవేల్లో కూడా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారు. కొంత మంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ ఫిక్స్ చేసి మాట్లాడుకుంటూ వెళ్తున్నారు. కారు నడిపే వ్యక్తులు సీటు బెల్టు పెట్టుకోకుండా కారు నడిపే దృశ్యాలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. సీటు బెల్టు లేకపోవడం వలన సైతం తలకే ఎక్కువగా గాయాలై మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. కొన్ని కొన్ని సార్లు బెలూన్లు ఓపెన్ కాకపోతే ప్రాణాలు నిలవడం కష్టమే. పోలీసులు, రవాణాశాఖ, ఇతర అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ని కొత్త కార్యక్రమాలు తీసుకువచ్చినా తుదిగా పాటించాల్సింది ప్రజలే. ముఖ్యంగా బైక్, కారు నడుపుతున్నప్పుడు స్పీడు ఎక్కువగా పోవడం, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా డ్రైవ్ చేయడం వలన ఈ మధ్యకాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలకు గురైనప్పుడు జీవితాంతం బాధ పడాల్సి వస్తోందని చెపుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాల్లో ప్రధానమైనవి..

- ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలి. మితిమీరిన వేగంతో వెళ్లొద్దు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలి. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ గుర్తులను అనుసరిస్తూ ప్రయాణికులు సురక్షితంగా రోడ్లపై తమ గమ్యస్థా నాలకు చేరుకోవాలి.
- వాహనాన్ని నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లను ఉపయోగించకూడదు.
- కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ చేసే వారితో పాటు మిగిలిన వారు కూడా సీటు బెల్టును ధరించాలి.
- రోడ్డుపై ఒక వాహనానికి.. మరో వాహనానికి మధ్య 50 అడుగుల దూరం ఉండాలి.
- మద్యం తాగి వాహనం నడపడం నేరం. ఇక త్రిబుల్, ర్యాష్ డ్రైవింగ్ ప్రమాదానికి కారణమవుతుంది.
- ఇక పాదచారులు రోడ్లపై నడిచేటప్పుడు ఎడమవైపునుంచి ఫుట్‌పాత్ పై నుంచి నడవాలి. రోడ్డును దాటాల్సి వచ్చిన క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, జీబ్రాక్రాసింగ్‌ల వద్ద మాత్రమే రోడ్డు దాటాలి.



అందరినీ చైతన్య పరుస్తున్నాం..

టి. జయపాల్‌రెడ్డి, సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, వరంగల్.



జాతీయ రోడ్డు భద్రతామాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతా నిబంధనలు తెలిసేలా, అందరిలో చైతన్యం కలిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల జరిగే పరిణామాలు, శిరస్త్రాణం లేకుండా బైకులు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశాల గురించి తెలియజేశాం. ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు త్రిబుల్ రైడింగ్, ర్యాష్‌డ్రైవింగ్ తదితర కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు మినీ టెలీఫిలింను ప్రదర్శించాం. వరంగల్ జిల్లాలో రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లు, రోడ్లపై రేడియం స్టిక్కర్లు, జీబ్రాక్రాసింగ్, తదితర గుర్తులను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు, ఆర్టీఏ అధికారులు, సిబ్బందితో కలిసికట్టుగా ఈ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాం.

అవగాహనతో ప్రమాదాల నివారణ

బి.చందన్, ఎస్ఐ, వర్ధన్నపేట



అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. ప్రతీ ఒక్కరు పోలీసులు, రవాణాశాఖ అధికారులు సూచించే భద్రతా నియమాలను పాటించాలి. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్య ఎక్కువ కావడం అందరినీ కలిచివేస్తోంది. దీని పట్ల కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో వర్ధన్నపేట మండలంలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజలను చైతన్య పరచడంతో పాటు డ్రైవర్లను కూడా చైతన్యవంతులను చేస్తున్నాం. ఆర్థిక, సామాజిక, సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక కార్యాచరణ చేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లు రోడ్లపై బైకులు వేసుకుని తిరగడాన్ని కఠినంగా పరిగణిస్తాం.



సంకీర్తనా మండలి సమావేశంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి, వేదికపై మేయర్ గుండు సుధారాణి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వికాసతరంగిణి ప్రతినిధులు



నగరం.. ఆధ్యాత్మిక సౌరభం

- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు

హనుమకొండ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారుల కళాప్రదర్శనలతో హోరెత్తిపోయింది. వికాస తరంగిణి వరంగల్, హనుమకొండ శాఖల ద్వారా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల వరకు సంకీర్తన మండలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ర్యాలీని ప్రారంభించారు. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, సిద్ధిపేట తదితర జిల్లాల నుంచి ప్రాచీక కళారూపాలైన బోనాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో ఒక్కో కళారూపం ఒక్కో రకంగా ఏకరూప దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వికాస తరంగిణి కార్యకర్తలు మంగళ హారతులతో ర్యాలీలో పాల్గొన్నారు. కిలోమీటర్ల పొడవునా ర్యాలీ నేత్రపర్వంగా కొనసాగిన క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అయినా కళాకారులు ఉత్సాహంతో సంకీర్తనను ఆలపిస్తూ మిన్నంటే జైశ్రీమన్నారాయణ నినాదాలతో నృత్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఓరుగల్లు నగర చరిత్రలో ఆధ్యాత్మిక సౌరభంతో కూడిన అతి పెద్ద ర్యాలీగా సంకీర్తన మండలి ర్యాలీ కొనసాగింది.

హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలి..

భక్తి కళాసంఘాల ద్వారా హిందూ ధార్మిక విలువలను విస్తరింపజేయాలన్న లక్ష్యంతో తన ఆలోచనల ప్రతిరూపంగా సంకీర్తన మండలి ఆవిర్భవించిందని, దాని తొలి కార్యక్రమానికి బోణీగా ఓరుగల్లు నగరం నిలిచిందని పరమహంస పరివ్రాజక ఆచార్యుడు, సమతామూర్తి స్థాపకుడు, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి అన్నారు. 2001 సంవత్సరంలో కృష్ణం వందే జగద్గురుమ్, 2003 గీతా జ్యోతి కార్యక్రమాలకు ఓరుగల్లే బోణీగా ప్రారంభమై తెలుగు రాష్ట్రాల్లో విస్తరించాయని, అదే ఆనవాయితీగా తమ సంకీర్తనా మండలి హైందవ భక్తి కళామార్గాన్ని కూడా వరంగల్ నుంచే ప్రారంభింపజేస్తున్నట్లు ఆయన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ప్రాచీన కళారూపాలను గౌరవించడంతోపాటు కళాకారులను ప్రోత్సహిస్తూ భావితరాల వారికి కళారూపాలను పదిలపర్చేందుకోసమే ఈ సంకీర్తన మండలి పని చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరిలో మానసిక శక్తిని పెంపొందింపజేసేవి సంకీర్తనేనని, వాటితోపాటు కళారూపాలు కూడా ప్రతీ మనిషిలో చైతన్యం నింపుతాయన్నారు. ప్రతీ కళారూపంలోనూ దైవత్వం దాగి ఉంటుందని, అందుకే ఏ కళారూపాన్ని తీసుకున్నా ధార్మిక చింతన ఉంటుందని చెబుతూ ప్రతీ కళారూపాన్ని ఈ తరం యువతకు అందజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అనేక సంప్రదాయాల సమహారమే హైందవ ధర్మమని, భగవంతుడితో భక్తుడికి అనుసంధాన సాధనం భక్తి మార్గమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ఓరుగల్లు నగరం భక్తి ప్రవాహంలో మునిగిందని, చిడతలు, డప్పులు, కోలాటం, నృత్యం లాంటి ప్రదర్శనలు ఎన్నో తనకు ఆనందంగా కలిగింపజేశాయని చినజీయర్ స్వామి అన్నారు. ప్రతీ ఒక్కరిని భక్తిరసంలోకి తీసుకెళ్లి ఓలలాండింపజేసే గుణం ప్రతీ కళకు ఉంటుందన్నారు. అందులోని సాహిత్యాన్ని తీసుకొని కళారూపాన్ని సజీవంగా ప్రదర్శింపజేసేందుకు చదువు రాకున్నా కళాకారుల ప్రతిభ అద్భుతమని కితాబిచ్చారు. ఇక నుంచి సంకీర్తన మండలిని తెలుగు రాష్ట్రాల్లో విస్తరింపజేస్తామన్నారు.

తొలుత దేవనాద జీయర్ స్వామి అధ్యక్షపాన్యాసం చేస్తూ.. ఆధ్యాతిక పునాదులపై సామాజిక సేవతోపాటు భక్తి కళామార్గం రూపొందించేందుకు ఓరుగల్లు వేదికగా కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఓరుగల్లుకు స్వామివారి రాకతోపాటు కళారూపాల ప్రదర్శన ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా తరలివచ్చిన కళాకారులతో పర్వదిన సందడి కనిపిస్తోందన్నారు. నేపాల్ కృష్ణమాచార్య, సముద్రాల శఠగోపాచార్య, నాయిని నీలిమా రాజేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆచార్య పి.జ్యోతి, వికాస తరంగిణి కేంద్ర కమిటీ పక్షాన మహేందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. వరంగల్, హనుమకొండ వికాస తరంగిణీల చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, మురళీకృష్ణతో పాటు వికాస తరంగిణి నిర్వాహకులు చాడ సుభాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మురళీధర్‌రావు, తిరుమల్, ఉమా, ఆచార్య జ్యోతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదిక వద్ద తిరుమలగిరి నుంచి గంగిరెద్దులతో తరలివచ్చిన కళాకారుల విన్యాసాలను స్వామి ఆసక్తిగా తిలకించారు. గోమాత ప్రత్యేకతను తెలియచెబుతూ దానికి ఆహారాన్ని అందించారు. గిరిజన సంప్రదాయ ప్రదర్శన, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన, చింతు యక్షగానం, కూచిపూడి కళా నృత్య ప్రదర్శనలు దేనికదే ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. ఈ కార్యక్రమం ప్రారంభంలో హనుమాన్ చాలీసాపై స్వామివారితో సహా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు చేసిన నృత్యంతో ఓరుగల్లు ఓలలాడింది.



కోలాటం ఆడుతూ భజనలు చేస్తున్న మహిళలు



సంస్కృతాంధ్ర అధ్యాపకుడికి సన్మానం

గిర్మాజిపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని మద్రాసు క్రైస్తవ కళాశాల తెలుగుశాఖ, నెల్లూరు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మద్రాస్ క్రైస్తవ కళాశాల సెమినార్ హాల్‌లో అధ్యాపకుడు సతీష్‌కు సన్మానం జరిగింది. ద్రావిడ బాషల్లో ప్రాచీన కావ్యాలు- తులనాత్మకత పై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ క్రమంలో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కొణిదల శోభ అధ్యక్షతన ఉదయం జరిగిన సెషన్‌లో వరంగల్ శ్రీ విశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సానబోయిన సతీష్ తెలుగు-తమిళ సంస్కృతులు తులనాత్మక పరిశీలన అంశంపై పత్రాన్ని సమర్పించారు. అనంతరం సతీష్‌ను సదస్సు సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ సత్కరించారు.



అధ్యాపకుడు సతీష్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

గాంధీజీ పోరాటం మరువలేనిది



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, గాంధీజీ అనుసరించిన మార్గంలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి, అమరవీరుల స్మారక దినోత్సవాన్ని నిర్వహిం చారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటంలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● గిర్మాజిపేట : గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ గురువారం గాంధీకి నివాళులర్పించారు. వరంగల్ రైల్వేస్టేషన్‌రోడ్డులోని బాపూజీ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.రాజ్ మహ్మద్, లాజర్, కమల్, మోహన్‌రెడ్డి, శారద ,లావణ్య, జస్వీర్ సింగ్,విశాల్, నాగరాజు,రమ్య,శ్రీవిద్య,రాధిక,స్వప్న, శ్రీను, సదానందం,యాకుబ్,నవీన్, వేణు, రవి, కంచర్ల వేణు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్ : గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్‌లోని ఆరెపల్లిలో గురువారం జ్వాల అవినీతి వ్యతిరేక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మహాత్మ గాంధి వర్ధంతి కార్యక్రమం ఘన oగా నిర్వహించారు. జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో మహాత్మ గాంధి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తాటికొండ శ్రీహరి, సింది మధుకర్, మహ్మద్ ఫిరోజ్, బొమ్మగాని సతీష్ పాల్గొన్నారు.

● కాశిబుగ్గ : జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కాశిబుగ్గ గుడి వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి చేసిన సేవలను, త్యాగాలను వక్తలు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు గుండేటి నరేందర్, బస్వరాజు శిరీష శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరమేష్, చాగంటి శ్రీనివాస్, దూపం సంపత్ పాల్గొన్నారు. ఆర్యవైశ్య జిల్లా మహాసభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సదాశివుడు, దాచేపల్లి సీతారాం, వీరభద్రయ్య, ప్రశాంత్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, ఆంజనేయులు, సురేందర్ పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్

గాంధీ విగ్రహాలకు బీఆర్ఎస్ నాయకుల వినతులు



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

గిర్మాజిపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం 420 రోజుల పాలనలో 420 హామీలు విస్మరణపై గాంధీకి వినతిపత్రం ఇవ్వాలన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు గురువారం వరంగల్‌లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వ ర్యంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ టి.రమేష్‌బాబు, పార్టీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

● వరంగల్ చౌరస్తా : మోసపూరిత వాగ్దానాలతో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలను వంచించారని బీఆర్ఎస్ 29వ డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గురువారం కేటీఆర్ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు నగరంలోని రామన్నపేటలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు.

మామునూరు పీటీసీలో
పీసీ టూ హెచ్‌సీ శిక్షణ ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ పూజ

మామునూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరు క్యాంపు కార్యాలయంలోని పోలీసు శిక్షణ కళాశాలలో 254 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రమోషనల్ కోర్సు (పీసీ టూ హెచ్‌సీ) శిక్షణ ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ గురువారం ఈ శిక్షణను ప్రారంభించగా రెండు వారాలపాటు కొనసాగనుంది. వివిధ జిల్లాల నుంచి హాజరైన 254 మంది కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం హెడ్ కానిస్టేబుళ్లగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, పాండునాయక్, భిక్షపతి, ఆర్‌ఐలు చంద్రశేఖర్, మహేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సేవలందించడమే లక్ష్యం



కేడల జనార్దన్‌ను సత్కరిస్తున్న కొండా మురళీధర్‌రావు

శంభునిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎమ్‌సీ) డైరెక్టర్‌గా నగరంలోని రంగశాయిపేటకు చెందిన కేడల జనార్దన్ నియమి తులయ్యారు. కేడల జనార్దన్ ప్రస్తుతం ఖిలావరంగల్ పీఏసీ ఎస్ చైర్మన్, ఏడీఎమ్‌సీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జనార్దన్ భార్య కేడల పద్మ గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. కేడల జనార్దన్‌కు ఏఎంసీ డైరెక్టర్‌గా నియమించినందుకు స్థానిక నాయకులతో పాటు ప్రజలు జనార్దన్‌కు అభినందనలు తెలిపి సత్కారాలు చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్‌రావు జనార్దన్‌ను సత్కరించారు. అలాగే కేడల పద్మజనార్దన్‌ను పలువురు నాయకులు ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. సత్కరించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్‌లు, కార్పొరేటర్‌లు గుండు చందనపూ ర్ణచందర్, పోశాల పద్మస్వామి, ఆర్‌వైఎఫ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కలకోట్ల రమేష్, ఈదుల భిక్షపతి, రమేష్, దామెరకొండ కర్ణాకర్ ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి

వరంగల్‌సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 14వ డివిజన్ ఏనుమాములకు చెందిన బీజేపీ నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో సుమారు 50మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరివారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పత్రి సుభాష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి యేడాది కిందటి వరకు బీఆర్ఎస్‌లోనే కొనసాగామని, కొందరి ప్రోద్బలం మేరకు బీజేపీలో చేరానన్నారు. తమకు తాము సమీక్షంచుకుని బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఎల్లావుల కుమార్ యాదవ్, కేతిరి రాజశేఖర్, పత్రి రాజపోషాలు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి గుప్త శిశిర నవరాత్రులు



అమ్మవారికి హారతి ఇస్తున్న దృశ్యం

వరంగల్ కల్చరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఓరుగల్లులో స్వయం భువుగా భక్తుల పూజలందుకుంటున్న భద్రకాళి అమ్మవారికి మాఘమాసం ప్రారంభం రోజున గుప్త శిశిర నవరాత్రులు ప్రారంభమయ్యాయి. గురువారం అమ్మవారికి విశేషమైన అభిషే కాన్ని, వేద మంత్రోశ్చరణల మధ్య పండితుల వేద ఘోషతో అమ్మవారికి మహా అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం మహా అలంకరణ, మహా నైవేద్య నివేదన, మహా మంగళ నీరాజనాలను గావించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేష భారతి, అర్చకులు భద్రకాళి శేషు, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్, అర్చకబృందం,సిబ్బంది పాల్గొన్నారు.

కామేశ్వరీ అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో గురువారం శిశిర నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ నిర్వహించి కామేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 12 వరకు అమ్మవారి దేవాలయంలో శిశిర నవరాత్రులు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం గణపతి, సుబ్రహ్మణ్య, సూర్యనారాయణ, లక్ష్మీనర్సింహ, శివ, బాలా, లలిత, రాజ శ్యామల ఆవరణ, అర్చనలు జరుగుతాయని అర్చకులు తెలిపారు. నవరాత్రులకు ప్రతీ రోజు భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు



పార్టీలో చేరినవారితో కొండా మురళీధర్‌రావు

వరంగల్‌సిటీ, జనవరి30:(ఆంధ్రజ్యోతి) ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య సభ్యులు కొందరు గురువారం హనుమకొండలోని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరివారికి కొండా మురళీధర్‌రావు కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. పార్టీలో చేరినవారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్టీలో చేరినవారిలో ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ తౌటిరెడ్డి రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు గాయపు హేలెందర్‌రెడ్డి, కొండేటి నారాయణరెడ్డి, దేవా సుధీర్‌బాబు, ముఖ్య సభ్యులు కోసన కొండల్‌రెడ్డి, దుబ్బాక రాజిరెడ్డి, నీలం విజయభాస్కర్‌రెడ్డి, నందిపాక దినేష్, సమ్మయ్య, వినయ్, రవి, రాజ్, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మేర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కాశిబుగ్గ, జనవరి30(ఆంధ్రజ్యోతి): మేర సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేర (దర్జీ) సంఘం వరంగల్ మండల అధ్యక్షుడు సోమ మధుకర్, బాలాజీ, హనుమాన్, సూర్యసాగర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సమావేశం



నల్గొండ రమేష్‌తో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

వరంగల్‌సిటీ, జనవరి 30: (ఆంధ్రజ్యోతి) అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు దంపతుల ప్రధాన అనుచరుడు నల్గొండ రమేష్‌తో గురువారం మరోమారు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. పార్టీ పదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వదలకుండా పార్టీకి కట్టుబడి పనిచే శామని, పార్టీ అధికారంలోకి వచ్చాక తమకు ఈ దుర్భర పరిస్థితి ఏమిటని కార్యకర్తలు నల్గొండ రమేష్‌తో అన్నట్లు సమాచారం. పార్టీ కోసం పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పారు. ఇప్పుడేమో పదవులు లేవు.. పార్టీలో గుర్తింపు కూడా లేకుండా పోతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొండా మురళితో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుందామని నాయకులు చెప్పగా, కొండా మురళీధర్‌రావుతో మాట్లాడానని నల్గొండ రమేష్ నాయకులకు చెప్పినట్లు తెలిసింది.

జిల్లాను సినిమా పరిశ్రమ కేంద్రంగా ప్రకటించాలి



కళాకారుల ఐక్యవేదిక సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ మురళీధర్‌దేశ్‌పాండే

మట్టెవాడ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాను సినిమా పరిశ్రమ కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సినీ టీవీ, జానపద సంగీత సాహిత్య నృత్యనాటక కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ మురళీధర్‌దేశ్‌పాండే అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం సాయంత్రం కళాకారుల ఐక్యవేదిక సమావేశం గడ్డం సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మురళీధర్‌దేశ్ పాండే, కళా రాజేశ్వర్‌రావు, నజీర్ అహ్మద్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన రాష్ట్రం మన సినిమా కావడానికి ప్రతి ఒక్కరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపుచ్చారు. సంప్రదాయ కళలు, సాంస్కృతిక సంగీత నృత్యాలు సజీవంగా ఉండలాంటే వీటి పరిరక్షణ కోసం కళాకారులు ఉద్యమాలు చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వరంగల్‌లో సినీ పరిశ్రమ కేంద్రంగా పరిగణించాలని కళాకారులకు ప్రభుత్వం అండగా నిలువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్, అన్వర్, శ్యామల గణేశ్, ఆడెపు రవీందర్, టీవీ అశోక్, రఘుచందర్, జడల శివ, ఆలేటి శ్యాం, రవి, గజ్జి దినకర్, రజితరెడ్డి, భుజేందర్, రాజేశ్‌కన్నా, ఖదర్ పాల్గొన్నారు.

బీసీ రాజకీయ యుద్ధభేరిని జయప్రదం చేయాలి

శంభునిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు రావాల్సిన హక్కుల కోసం ఫిబ్రవరి 2న హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో హలో బీసీ- చలో వరంగల్ పేరుతో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరికి బీసీలంతా తరలిరావాలని బీసీ నాయకుడు ఆరెకటిక సంఘం అధ్యక్షులు రావుల బాలరాజు పిలుపునిచ్చారు. బీసీ రాజకీయ యుద్ధభేరికి మద్దతు తెలుపుతూ గురువారం రంగశాయిపేట ఆరె కటిక సంఘంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకలు జింక రమేష్ ఆధ్వర్యంలో రంగశాయిపేట బొడ్రాయి సెంటర్ వద్ద బీసీ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుండు పూర్ణచందర్, మండల నరసింహరాములు, శెంకేశి అనిల్, మండల సీతారాములు, వడ్డె శిరీష్, పాలకుర్తి సుమన్ కంచ మల్లయ్య, దువ్వ రాజు బిట్టు, ఎలుగు రాకేష్, తదితరులు పాల్గొన్నారు. బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు బీసీలంతా తరలిరావాలని బీసీ బుద్ధిజీవుల వేదిక వరంగల్ జిల్లా యునైటెడ్ కన్వీనర్ మండల పరుశరాములు పిలుపునిచ్చారు.

కోల్డ్‌స్టోరేజీని ప్రారంభించిన చినజీయర్‌స్వామి



కోల్డ్‌స్టోరేజీని ప్రారంభించిన సందర్భంగా త్రిదండి చినజీయర్‌స్వామితో వ్యాపారులు

వరంగల్ వ్యవసాయం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్ పరిధిలో చల్లా శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా నిర్మించిన లక్ష్మీసాయి కోల్డ్ స్టోరేజీని గురువారం త్రిదండి చినజీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, మడూరి వేదప్రకాష్, సాగర్ల శ్రీనివాస్, అల్లె సంపత్, చింతపల్లి వీరారావు, కంభంపాటి కుమారస్వామి, ఎన్‌రెడ్డి లింగారెడ్డి, మార్కెట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గోదాములను తనిఖీ చేసిన గిడ్డంగుల సంస్థ చైర్మన్

వరంగల్ వ్యవసాయం, జనవరి 30:(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల పరిధిలోని గోదాములను గురువారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన చేస్తున్నారా.. లేదా.. అన్నది ఆరా తీశారు. మిల్లర్లు అప్పగిస్తున్న సన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, మేనేజర్ వెంకటేశ్వర్లు, పాషా, సమీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ అధికారులు, అర్చకులు సచివాలయంలో మంత్రిని గురువారం కలిసి ఆహ్వానం అందించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు బ్రహ్మోత్సవాలు జరగుతున్నాయి. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానం అందించారు. బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్ని మంత్రి సురేఖకు ఆలయ ఈవో పురేంద్ర కుమార్ వివరించారు. ఉత్సవాల సంద్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సంపత్, తదితరలు మంత్రికి ఆహ్వానం అందించిన వారిలో ఉన్నారు.

అయ్యో గిట్లాయెను..!

● **మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి కోడ్ ఎఫెక్ట్**

వరంగల్ వ్యవసాయం, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయకుండా ఆగాల్సిందేనా..? అంటే ఆగాల్సిందేనని మార్కెటింగ్‌శాఖ అధికారుల నుంచి వస్తున్న సమాధానం. ఎందుకంటే ప్రభుత్వం పాలకవ ర్గాన్ని ప్రకటించింది.. కానీ నూతన పాలకవర్గం చార్జీ తీసుకోలేదు. కాబట్టి కోడ్ ముగిసే వరకు వేచి చూడక తప్పదనే సమాధానమే వస్తుంది. చార్జీ తీసుకుంటే కోడ్ వర్తించకపో యేదని సమాచారం. 18 నెలల తరువాత ఎట్టకేలకు మార్కెట్ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తే, మార్కెట్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. కానీ..అంతలోనే ఎన్నికల కోడ్ కూయడంతో మరో నెల రోజుల పాటు వేచి చూడకతప్పని పరిస్థితి నెలకొంది. బుధవారమే ఎన్నికల కోడ్ వస్తుందని ముందే పసిగడితే ఈ పరిస్థితి వచ్చేదికాదని, కోడ్ కూయకముందే (చార్జీ తీసుకునేవాళ్లం)ప్రమాణ స్వీకారం చేసేవాళ్లమని నూతన పాలకవర్గం సభ్యులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మార్కెట్‌ను సందర్శించిన నూతన చైర్‌పర్సన్ దంపతులు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి నియమితులైన నూతన చైర్ పర్సన్ ఎర్ర ప్రియాంక తన భర్త అనిల్‌తో కలిసి గురువారం మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను కలిశారు. చార్జీ తీసుకునే విషయం ప్రస్తావనకు వస్తే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే సమాచారం ఇస్తామని మార్కెట్ కార్యదర్శి చైర్‌పర్సన్‌కు చెప్పినట్లు తెలిసింది. మార్కెట్‌ను ఒకసారి చూద్దామని వచ్చినట్లు చైర్‌పర్సన్ ప్రియాంక కార్యదర్శి నిర్మలకు తెలుపడంతో కార్యదర్శి నిర్మల చైర్‌పర్సన్ చాంబర్‌తో పాటు అధికారులు, సిబ్బంది పని చేసే గదులను చూపించారు. ఆ తదుపరి చైర్ పర్సన్ ప్రియాంక అనిల్ దంపతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బంగారం షాపు దోపిడీకి యత్నం

మట్టెవాడ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ విశ్వకర్మ వీధిలో గురువారం బంగారాన్ని కరిగించే బట్టి దుకాణంలో దోపిడీ దొంగలు చొరబడి బంగారు షాపు యాజమాని బ్యాగ్‌లో బంగారు వస్తువులను దోచుకునేందుకు షాపులోకి ప్రవేశించి దాడిచేసి దొంగిలించడానికి ప్రయత్నించారు. సదరు షాపు యాజమాని ప్రతిఘటించడంతో పరారయ్యారు. స్థానికులు, బాధితులు సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం వరంగల్ విశ్వకర్మ వీధిలో బంగారాన్ని కరగబెట్టే దుకాణ యాజమాని సంజయ్ షాపు తెలిచి షాపులో ఉండగా ఇద్దరు గుర్తు తెలియని యువకులు టోపీలు, మాస్కులు ధరించి షాపులోకి చొరబడి సంజయ్‌పై దాడి చేశారు. అతడి వద్ద బ్యాగ్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించారు. షాపు యాజమాని ప్రతిఘటించడంతో ఇద్దరు పారిపోయారు. బ్యాగ్‌లో సుమారు కొన్ని బంగారు వస్తువులున్నట్లు తెలిసింది.

పథకం ప్రకారమే దాడి

గుర్తు తెలియని వ్యక్తులు ఒకరు మాస్కు, మరొకరు టోపీ ధరించి ఉదయం 9.30 గంటల ప్రాంతంలోషాపు యాజమాని ఒక్కడే ఉన్న సమయంలో పథకం ప్రకారమే దాడి చేసి బ్యాగ్‌ను లాక్కునేందుకు ప్రయత్నించారు. విశ్వకర్మ వీధిలోకి నడుచుకుంటూ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఒకరి తర్వాత మరొకరు పారిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇదే దుకాణంలో గత ఏడాది జూన్ 14న ఈ షాపులో పనిచేసే గుమస్తా సుమారు 800 గ్రాముల బంగారాన్ని దొంగిలించారు. ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు భావిస్తున్నారు. మట్టెవాడ పోలీసులు విశ్వకర్మ వీధిలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దాడిలో గాయపడిన సంజయ్ నుంచి వివరాలను సేకరించినట్లు తెలిసింది.

అధిక సాంద్రత పత్తిసాగుతో లాభాలు


కిసాన్ మేళా స్టాల్స్ ప్రారంభంలో కలెక్టర్ సత్యశారద



కిసాన్ మేళా స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

మామునూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత విధానంలో పత్తిసాగు చేస్తే దిగుబడి లాభసాటిగా ఉంటుందని వరంగల్ కలెక్టర్ సత్యశారద రైతులకు సూచించారు. కేంద్రియ వ్యవసాయ పరిశోధన వరంగల్, మామునూరు కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ హాజరై ఏర్పాటు చేసిన కిసాన్ మేళా స్టాల్స్‌ను ప్రారంభించి సందర్శించారు. అధిక సాంద్రత పత్తి సాగు యజమాన్యంలో మెళకువలు అనే చిరు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన పద్ధతులతో వ్యవసాయం చేయాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం సేవలు రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవీ నరసింహరావు పశు వైద్య యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్ కిషన్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత పత్తి పద్ధతిని పాటించి అధిక దిగుబడులు సాధించాలని, గులాబీరంగు పురుగును తట్టుకోవాలని, దీనివల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్య పశుసం వర్ధక అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ అనురాధ, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి సంగీత లక్ష్మి, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, డాక్టర్ కిషన్‌కుమార్, ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్తలు వీరన్న, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్ 500 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ★★



ANDHRAJYOTHY
గ్రేటర్ వరంగల్
5
శుక్రవారం 31 జనవరి 2025



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలి


వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద కోరారు. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నేషనల్ హైవే భూసేకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూ సేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందవద్దని, మెరుగైన పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండ, సంగెం మండలం చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని, నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటుకు రైతులు తమ భూములు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు వెంకటస్వామి, రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిర్చి ధర దడ



- రెండేళ్లుగా పడిపోతున్న పంట ధరలు
- క్వింటా రూ.99వేల నుంచి రూ.20 వేలకు పతనం
- ఎగుమతులు లేకుంటే ఇంకా తగ్గే అవకాశం
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజీల్లో పేరుకుపోయిన బస్తాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 68 వేల ఎకరాల్లో సాగు



వరంగల్ వ్యవసాయం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి మిర్చి సాగు చేసిన రైతులకు పంట అమ్ముకునే సమయంలో ధరలు నిరాశపరుస్తున్నాయి. మార్కెట్లో ఇప్పటికే మిర్చి సీజన్ ప్రారంభంకాగా, ధరలు చూస్తే మాత్రం ఏమాత్రం ఆశాజనకంగా లేదు. అసలే ఓ వైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడి తగ్గింది. మరోవైపు పెట్టుబడి పెరిగింది. ఈ నేపథ్యంలో పంట అమ్మితే వచ్చే ఆదాయానికి, పెట్టిన పెట్టుబడికి పొంతనలేకుండా పోతోంది. ప్రస్తుతం మార్కెట్లో మిర్చి ధరలు చూస్తే రైతులు అప్పుల పాలయ్యే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి.

కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి బస్తాలు

మార్కెటింగ్‌శాఖ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఉన్న 87 కోల్డ్ స్టోరేజీలలో ఇప్పటికే 21 లక్షలపై చిలుకు మిర్చి బస్తాలు నిల్వ చేసి ఉన్నాయి. అందులో ప్రస్తుతం వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ పరిధిలో ఉన్న 25 కోల్డ్ స్టోరేజీల్లో ఇప్పటికే సుమారు పది లక్షల బస్తాల మిర్చి బస్తాలు నిల్వ ఉన్నాయి. గతేడాది కూడా మిర్చి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ధర పెరిగినప్పుడు అమ్ముకుందామని చూస్తుంటే ధరలు మాత్రం రోజు రోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎగుమతులు లేకనే తగ్గుతున్న ధరలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, గుంటూరు జిల్లాలు మిర్చి పంటకు ప్రసిద్ధి. ఇక్కడ పండిన మిర్చి దేశీయంగానే కాక విదేశాలకు కూడా పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, ఇండోనేషియా, టిబెట్, చైనా, మలేషియా తదితర దేశాలకు విక్రయిస్తారు. మన దేశం నుంచి మిర్చి ఎగుమతి చేయాలటే నాణ్యతే ప్రమాణికం. మిర్చి కలర్, తేమశాతం, పురుగుమందుల అవశేషాలు ఇలా అన్నింటినీ పరిగణలోకి తీసుకున్నాకే ఎగుమతులకు అనుమతులు లభిస్తాయి. లేదంటే దేశీయంగా ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు ఎంత ఎగుమతులు చేసినా ధరలు పెరిగే అవకాశం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.

2023 సంవత్సరం.. మిర్చి పంటకు సువర్ణయుగం


మిర్చి రైతులకు 2023వ సంవత్సరం సువర్ణ యుగం అని చెప్పాలి. అపుడు మిర్చి క్వింటాల్‌కు రూ.99 వేల ధర పలికింది. అంత ధర పలుకుతుందని ఎవరూ ఊహించలేదు. కానీ ఆ తరువాత వరుసగా ధరలు పతనమవుతూ వస్తున్నాయి. ప్రస్తుతం దేశీ రకం మిర్చికి క్వింటాకు రూ.18 నుంచి 25 వేల వరకు ధర పలుకుతోంది.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తే గిట్టుబాటు ధర

పోలెపాక నిర్మల, ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

"మిర్చి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు చంటి పిల్ల వలె చూసుకోవాల్సి ఉంటుంది. సేంద్రియ ఎరువులను వాడాలి. పంట చేతికి వచ్చిన తరువాత కాయలు చిన్నవి, పెద్దవి, నలుపు, తాలు ఇలా దేనికి అవే అన్నట్లు గ్రేడింగ్ చేయాలి. అదేవిధంగా మార్కెట్‌కు తరలించే ముందు బాగా ఆరబెట్టి తేమ లేకుండా చేయాలి. అప్పుడే మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుంది. రైతులు హర్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలి.

నగరం ఆధ్యాత్మిక సౌరభం



◄ నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తికళాకారులు, చిన్నజీయర్ అభివాదం

- నగరంలో నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తరలివచ్చిన కళాకారులు
- అలరించిన భక్తి కళాప్రదర్శనలు
- హిందూ ధార్మిక విలువలను విస్తరింపచేద్దాం
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి
- వరంగల్ కేంద్రంగా సంకీర్తన మండలికి శ్రీకారం

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే



క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులు నిర్దేశిత నిబంధనలు పాటిస్తేనే అనుమతులు మంజూరు చేస్తామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. గురువారం నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్‌ల ఏర్పాటు, బిల్డింగ్ నిర్మాణ అనుమతులకు పలువురు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వాటికి అనుమతుల మంజూరు కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా లేఅవుట్ అనుమతుల జారీ కోసం అమ్మవారిపేట, మడికొండ ప్రాంతాల్లో, భవన నిర్మాణ అనుమతుల జారీ కోసం వడ్డెపల్లి ప్రాంతంలో కమిషనర్ పర్యటించి కొలతలు వేసి సమాచారాన్ని ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హర్షద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఖానాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనెల యువరాజు అన్నారు. గురువారం నిర్వహించిన వీవోఏల యూనియన్ మండలస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

వర్ధన్నపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని వరంగల్ అడిషనల్ కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. గురువారం వర్ధన్నపేట మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే వేసవి కాలంలో పట్టణ ప్రజలకు ఎలాంటి మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, మిషన్ భగీరథ ఇంజనీర్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. గురువారం వర్ధన్నపేటలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో భోజనం చేశారు. అనంతరం వర్ధన్నపేటలో నిర్మిస్తున్న మసీదు పనులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు దారి చూపించు మహాత్మా..

సంగెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో నెలకొని ఉన్న అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించి, కాంగ్రెస్‌కు దారి చూపించు మహాత్మా.. అంటూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండ కేంద్రంలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం సంగెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతకాని సర్కాకు బుద్ధి ప్రసాదించి, అసమర్థ ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగేలా చేయాలని మహాతుడిని వేడుకున్నట్లు స్పష్టం చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా ఈ జనవరి 30 కి 420 రోజులు పూర్తి చేసుకుంటుందని గుర్తు చేశారు. మోసపూర్తి వాగ్ధానాలతో ముఖ్యమంత్రిగా కూర్చున్న రేవంత్‌రెడ్డి ప్రతినిత్యం ప్రజలను వంచిస్తూనే వస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక 420 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంగెం మండలంలోని పల్లారుగూడలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు బానోతు కుటుంబాన్ని పరామర్శించే సమయం ఉండగా ఎన్నికల కోడ్ అనే సాకుతో పోలీసులు అనుమతి నిరాకరించారని తెలిపారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నరహరి తల్లి లక్ష్మి మృతిచెందగా ఆమె మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కోడూరు సదయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, పులుగు సాగర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల కుమారస్వామి, నాయకులు సమ్మయ్య, వీరేశం, గోవర్ధన్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

• నర్సంపేట (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ ఎంపిపి నల్లమనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆదేశం, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సూచన మేరకు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, బండి రమేశ్, ఎండిపాషా, మండల శ్రీనివాస్, నాగిశెట్టి ప్రసాద్, రామసహ ఆయం సుధాకర్ రెడ్డి, బాణాల రాంబాబు, నాయిని వేణుచంద్, పైసా ప్రవీణ్, కరుణాకర్, వెంకటేశ్వర్లు, సారంగం తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లందలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు హామీలపై బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి మాట్లాడగా, మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ సర్పంచ్ సుంకరి సాంబయ్య, మాజీ ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, అంజన్‌రావు పాల్గొన్నారు.

• దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుపరచాలని డిమాండ్‌చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రెబల్లే గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వ ర్‌రావు మాట్లాడగా, మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి, మండల ప్రధాన కార్యదర్శి మెరుగు రాంబాబు, వెంకటేశ్వర్లు, రవీందర్, ప్రశాంత్, మోహన్‌రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం బుధరావుపేటలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు మండలంలోని పాపయ్యపేటలో గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూక్య మురళినాయక్, సుదర్శన్ గౌడ్, రవి, రవిందర్, కట్టయ్య, బాలు, భూక్యలాలునాయక్ పాల్గొన్నారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్, మాజీఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకులు మండలం కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రంను అందించారు. కార్యక్రమంలో బీఆర్‌టీస్ మండల పార్టీ అధ్యక్షుడు సంగాని సూరయ్య మాట్లాడగా, పీఏసీఎస్ చైర్మన్ రాము, రవిందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు వీరస్వామి, యాకయ్య, స్వరూపరాణి, విజయ భిక్షపతి పాల్గొన్నారు.

• పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండలకేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, మాడుగుల రాజు, ఏర్పుల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్, బూర శ్యామ్, వెంకటరాజు, లక్ష్మినారాయణ, యాకయ్య, శశిరేఖ. కుమార్, నాగుల బాబు, బద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు గాంధీ

సంగెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు, నర్సింహనాయక్ పాల్గొన్నారు.


సంగెంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి

• నర్సంపేట (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సుతిరుపతి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గాంధీ అడుగుజాడలో నడవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు మాదాసిరవి, కొల్లూరి మధూకర్, గాజుల రమేశ్, పేరంబాబూరావు, గుంటి వీరప్రకాశ్, సాంబయ్య, పద్మాబాయి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపితా మహాత్మగాంధీ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా. టీపీసీసీ సభ్యుడు సోంటిరెడ్డి రంజిత్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డిలు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించారు. వారు మాట్లాడుతూ దేశం కోసం పోరాటం చేసిన మహనీయుడని కొనియడారు. కార్యక్రమంలో మండ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మరెడ్డి సుధాకర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండ పార్టీ అధ్యక్షుడు భూక్యగోపాల్‌నాయక్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదు మధుసుధన్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్, మండల నాయకులు వీరయ్య గౌడ్, కమలమ్మ, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

• పర్వతగిరి (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి కందికట్ల అనీల్ ఐనవోలు దేవస్థానం డైరెక్టర్లు పూర్ణచందర్, వెంకన్న, వీరస్వామి, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రమణమూర్తితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహత్మ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్‌బీఐ పల్లె సమగ్ర కేంద్రంలో గోల్‌మాల్?

• **నిర్వహకురాలు డబ్బులు డ్రా చేస్తోందని ఆరోపణలు**

చెన్నారావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ బ్యాంకు సేవల విస్తర్ణంలో భాగంగా కొన్ని గ్రామాల్లో పల్లె సమగ్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామంలోని పల్లె సేవా కేంద్రం నిర్వహకురాలు బ్యాంకు నిబంధనల ప్రకారం డబ్బులు జమ చేసినప్పుడు, ఖాతాదారులకు ఇచ్చినప్పుడు ఒక పుస్తకంలో రాస్తూ ప్రాసెస్ ప్రకారంగా లావాదేవీలను జరపాలి. ఇటీవల గ్రామానికి చెందిన ఓ ఖాతాదారుడు పల్లె సమగ్ర కేంద్రంలో తన ఖాతాలోని రూ.1లక్ష 47 వేలు, రూ.1లక్ష 20వేలను తీశాడు. అతడి ఖాతాలో ఉన్న మిగతా డబ్బుల కోసం వెళితే మొత్తం డబ్బులు డ్రా చేసినట్లు ఉంది. తన ఖాతాలో మిగతా డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో లేకపోవడంతో ఖాతాదారుడికి, నిర్వాహకురాలి మధ్య వాగ్వాదం జరిగింది. పెద్దల సమక్షంలో పంచాయితీ సైతం నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సదరు ఖాతాదారుడు తనకు మొత్తం డబ్బులు ఇవ్వలేదని గ్రామ దేవత (బొంద్రాయి) మీద గ్రామస్థుల సమక్షంలో ప్రమాణం చేసినట్లు సమాచారం. గతంలోనూ పల్లె సమగ్ర కేంద్రంలో ఖాతాదారుల ఖాతాల నుంచి నిర్వాహకురాలు డబ్బులు డ్రా చేసుకున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు పల్లె సమగ్ర కేంద్రంలో విచారణ చేపట్టి, ఇలాంటి మోసాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వీడాలి

నర్సంపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు ఉదయం నుంచి సాయంత్రం శ్రమించే పారిశుధ్య కార్మికుల కాలనీల్లో కనీస వసతులు కల్పించకుండా స్థానిక అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వల్ల సమస్యలతో సతమతమవుతున్నామని నర్సంపేట మునిసిపల్ కార్మికులు హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం నర్సంపేటలో కార్మికులు మాట్లాడుతూ మునిసిపాలిటీలో పనిచేసే అధిక శాతం పారిశుధ్య కార్మికులంతా పట్టణంలోని 16, 23, 24 వార్డుల్లో నివాసం ఉంటారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మునిసిపల్ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పారిశుధ్య కార్మికులమైన తాము నివసించే కాలనీల్లో కనీస వసతులు కల్పించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

నర్సంపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలై 90శాతం పక్షవాతానికి గురైన చెన్నారావుపేట మండలానికి చెందిన నలమాల వెంకటేశ్వర్లుకు నర్సంపేట పోస్టాఫీస్‌లో గురువారం స్థానిక పోస్టల్ ఐపీ సుచేందర్, ఐపీపీబీ మేనేజర్ సంపత్‌లు రూ.9లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ సురేష్, సునీత, దివ్య, రాజన్, కోటేశ్వర్, వీరభద్రయ్య, అశోక్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

నర్సంపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కులగణన ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేట పట్టణంలోని మేరు సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహదేవుని జగదీష్, సాంబయ్య, కొమ్మాలు, సాంబయ్య, రవికుమార్, రవి పాల్గొన్నారు.

లక్కమారి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

చెన్నారావుపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) మండలంలోని ఖాదర్‌పేట గ్రామంలో లక్కమారి కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా కూస కుమారస్వామి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పెండ్లి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా రవిందర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూస వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి, రాజయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో కుష్ఠుపై అవగాహన

చెన్నారావుపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : జాతీయ కుష్ఠు వ్యాధి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో గురువారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సురేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ

గీసుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేట హవేలి జెడ్పీ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు వారు రూ.60వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్‌ను గురువారం అందచేశారు. పాఠశాలలో రక్షిత మంచినీరు కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి హన్మకొండ బ్యాంకు మేనేజర్ కంప పవన్‌కుమార్‌కు తెలుపగా ప్యూరిఫైయర్‌ప్లాంట్‌ను అందించినట్లు హెచ్‌ఎం సంపత్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ హన్మకొండ బ్రాంచ్ డీజీఎం రాహుల్, ఆర్ఎం పవన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది ప్రీతి, శివ, హెచ్ఎంలు సంపత్‌రావు, రాజేశ్వరీ, గ్రామ కార్యదర్శి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడికి బాసటగా నిలుద్దాం..

వర్ధన్నపేట రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బడికి బాసటగా నిలిచి పేద ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేలా సహకరించాలని హెచ్‌ఎం బాలకిషన్ సూచించారు. గురువారం మండలంలోని ల్యాబర్తి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మన బడి పిలుస్తోంది అనే పిలుపుతో స్పందించి విద్యార్థులకు సహకారంగా రూ.15 వేలు అందించిన ఖమ్మంపాటి ఎల్లయ్య యాకమ్మలను, ఖమ్మంపాటి రాధిక రఘువీర్లను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ముందుకువస్తున్న ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిలాల్, సురేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వారిని ఉరికించే రోజులొస్తున్నాయి..


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉరికించే రోజులు రాబోతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాక్యర్‌రావు అన్నారు. వర్ధన్నపేట పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా దయాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అమలుకాని హామీలను ఇచ్చిందన్నారు. పింఛన్ పెంచుతామని, బ్యాంకుల నుంచి రుణం తీసుకోండి.. వాటిని మాఫీ చేస్తామని, కల్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని మాయమాటలు చెప్పి ఓట్లను దండుకుందన్నారు. గద్దెనెక్కగానే వాటిని తుంగలో తొక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పెంచుతామని మాట ఇచ్చి యేడాది ఎగ్గొట్టారన్నారు. జనవరి 26న ఇస్తామని మండలానికి ఒక్క గ్రామానికి ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందని వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి వర్ధన్నపేట మునిసిపాలిటీ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచామని ఎర్రబెల్లి పేర్కొన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సహకారంతో తాను ఎదిగానన్నారు. ఏ ఎన్నికలు వచ్చినా తనకు భారీ మెజారిటీ ఇచ్చి రాష్ట్రంలోనే ముందంజలో ఉంచారన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు సాగాలని ఎర్రబెల్లి కోరారు. వర్ధన్నపేట పట్టణ కమిటీ, ప్రతీ వార్డులో పది మంది సభ్యులతో కమిటీలు వేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎలేంద్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూళ్ల కుమారస్వామి, గుజ్జ గోపాల్‌రావు, మార్గం భిక్షపతి, సిలువేరు కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్, కంజర్ల రవికుమార్, కంజర్ల మహేష్, ఏరుకొండ వేణు గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అఘోరి హల్‌చల్


గీసుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మాల వద్ద సాధూ అఘోరి గురువారం ప్రత్యక్షమై హల్ చేసింది. కారులో వచ్చిన అఘోరి మచ్చాపూర్, కొమ్మాల ఆయల ఆర్చిగేటు వద్ద కొంతసేపు ఆగింది. ఈ సమ యంలో అక్కడికి చేరుకున్న కొందరు ఆమెను చుట్టుముట్టారు. అందులో ప్రయాగ త్రివేణి సంగమంలో ఉండాల్సిన మీరు ఇక్కడికి ఎందు కు వచ్చారు అంటూ అడగటంతో అఘోరి ఆగ్రహించారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ తాను ఉంటానని బదులిచ్చారు. నేను అక్కడికి వెళ్లింది మీరు చూశారా...కుంభమేళా నుంచే వస్తున్నాను.. నన్ను ప్రశ్నించటానికి మీరెవరు.. అంటూ చేతిలోని కర్రతో ఓ వృద్ధున్ని కొట్టే ప్రయత్నం చేసింది. దీంతో అక్కడ ఉన్నవారు ఒక్కసారిగా అడ్డుకోగా అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది.

దుర్గమ్మ గుడివద్ద భోజనం

ఖానాపురం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేపచెట్టుతండాలోని దుర్గమ్మ గుడివద్దకు గురువారం అఘోరి చేరుకుంది. నర్సంపేట నుంచి గూడూరు వైపు కారులో వెళ్తున్న అఘోరి వేపచెట్టుతండాలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న దుర్గమ్మ గుడివద్ద తన వెంట తెచ్చుకున్న భోజనం చేసి వెళ్లింది. ఇంతలో స్థానికులు గుమికూడి ఫొటోలు తీస్తుండగా అసహనానికి గురై అక్కడి నుంచి కారులో గూడూరు వైపు వెళ్లిపోయింది.


వేపచెట్టుతండాలోని దుర్గమ్మగుడి వద్ద భోజనం చేసి వెళ్తున్న అఘోరి

పలువురి పరామర్శలు


అమృతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

పర్వతగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అత్త గుండారపు అమృతమ్మ మృతిచెందగా, గురువారం ఆమె దశదినకర్మ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యానాయక్, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ నాయకుడు వరదరాజేశ్వర్‌రావు, ఆర్డీఎఫ్‌ఫౌండర్ మెంబర్‌రామ్మోహన్‌రావు అమృతమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపురం, ఊకల్‌లో బాధిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. ఇటీవల ఊకల్ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండపల్లి వెంకటయ్య, కేశవపురంలో గాజుల వెంకన్న, దుశారీ నర్సయ్య, చిలుముల నర్సయ్యలు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో వారి కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటానన్నారు.

• గీసుగొండ (ఆంధ్రజ్యోతి): 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన వీరమల్ల లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, మృతురాలి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాద్ గురువారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందించారు

డైనింగ్ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

చెన్నారావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్‌లో మోడల్ పాఠశాల విద్యార్థుల కోసం నిర్మాణం చేస్తున్న పనులు గురువారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ గోపీ మాట్లాడుతూ డైనింగ్ హాల్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్, మంద యాకయ్య పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి శంఖారావానికి తరలిన విద్యార్థులు

నర్సంపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించే బీసీ విద్యార్థి శంఖారావంసభకు పట్టణ విద్యార్థులు తరలివెళ్లారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, భిక్షపతి, రవి, శ్యాం ఉన్నారు.

విద్యార్థి దశలోనే కెరీర్‌పై దృష్టి పెట్టాలి

గీసుగొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే భవిష్యత్ కెరీర్‌పై విద్యార్థులు దృష్టిపెట్టి రాణించాలని సీనియర్ కౌన్సిలర్ నానాజీ అన్నారు. కొనాయిమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌లో భాగంగా అస్మాన్ ఫౌండేషన్ వారు విద్యార్థులకు సైకోమెట్రిక్ కెరీర్ అసైన్‌మెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు.

సమాచార చట్టం మండల అధ్యక్షుడిగా నాంచారి

ఖానాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు రక్షణ చట్టం మండలఅధ్యక్షుడిగా మండలంలోని కొత్తూరుకుచెందిన నాంచారి కుమారస్వామి ఎన్నికైనట్లు డివిజన్ అధ్యక్షుడు చెట్టుపెల్లి విజేందర్, ఉపాధ్యక్షుడు రొట్టె సురేష్ గురువారం తెలిపారు. కుమార స్వామి మాట్లాడుతూ సమాచర హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి


కృష్ణ(ఫైల్)

ఖానాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు సేవించి చికిత్స పొందుతూ ఒకరు గురువారం మృతి చెందారు. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొయ్యడి కృష్ణ (40) బుధవారం ఇంటి వద్ద గడ్డి మందు సేవించి అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురు వారం తెల్లవారు జామున మృతిచెందాడు. బుధవారం ఉదయం ఐనపల్లిలో తాడిచెట్లు ఎక్కడానికి వెళ్లిన కృష్ణ వద్దకు గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు వచ్చి గతంలో కృష్ణపై ఉన్న యాక్సిడెంట్ కేసు కాంప్రమైజ్ చేసుకోవాలంటే రూ.10లక్షలు ఇవ్వాలని, లేకుంటే కృష్ణను, అతని కుటుంబ సభ్యులను చంపుతామని బెదించడంతో మస్తాపం చెంది గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

ఖానాపురం, జనవరి (ఆంధ్రజ్యోతి) : గుడుంబా నిర్మూలనకై ఖానాపురం మండలంలో స్థానిక పోలీస్‌లు, ఎక్సైజ్ పోలీస్‌లు, టాస్క్‌ఫోర్స్ అధికా రులు సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై గురువారం తెల్ల వారుజామున దాడులుచేపట్టారు. నాజీతండాలో విస్తృత తనిఖీలు నిర్వహించి గుడుంబా తయారీ దారులను పట్టుకున్నారు. ఈ దాడుల్లో 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 1000లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డి తెలిపారు.

ఫిరంగి గడ్డలో చోరీ

వర్ధన్నపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని ఫిరంగి గడ్డలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగిన ఘటన చోటు చేసుకుంది. వర్ధన్నపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట ఫిరంగిగడ్డకు చెందిన పొన్నం వేణుకుమార్ ఇంటి నుంచి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంటికొచ్చి చూసేసరికి ఇంట్లో బీరువాలో దాచిన 3తులాల బంగారం, 20తులాల వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. పొన్నం వేణుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్ర్యాలలో ఆటో, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయపర్తి మండలంలోని సూర్యతండాకు చెందిన ఆటో పంథిని నుంచి కట్ర్యాల గ్రామం మీదుగా కొత్తపెల్లి వెళ్తుండగా కట్ర్యాల గ్రామానికి చెందిన తాటికాయల రమేష్, దుప్పెల్లి గణేష్‌లు బైక్‌పై వస్తుండగా ఢీకొన్నారు. రోడ్డు ఆటో వెళ్తున్న క్రమంలో గల్లీలో నుంచి బైక్ రావడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇక వర్ధన్నపేట పట్టణంలో సంగెపు వాగు వద్ద సైతం బైక్‌ను రాంగ్ రూట్‌లో వస్తున్న ఆటో ఎదురుగా ఢీకొట్టడంతో ఒకరికి గాయాలు కాగా, వర్ధన్నపేట అదనపు ఎస్సై మేరుగు రాజు సంఘటన స్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నారావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన గురువారం చోటు చేసుకుంది, ఎస్సై రాజేష్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఎమ్డీ.అంకూష్ (48) అనే వ్యక్తి ఈ నెల 19న లింగాపురం నుంచి గిర్నిబావికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన అంకూష్ హైదరబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగా, మృతుడి భార్య ముంతాజ్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.